క్లుప్తంగా

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

చురుగ్గా కాలువల నిర్మాణం


సింహాలదేవిడి వద్ద జరుగుతున్న కాలువ పనులు

అల్లిపురం: జీవీఎంసీ పరిధి 33వ వార్డులో కాలువల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. వార్డులో వేంకటేశ్వరమెట్ట, వేంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి సింహాలదేవిడి వరకు మురుగునీటి కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో జీవీఎంసీ నిధులు కేటాయించి గత నాలుగు రోజులుగా కాలువల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

వార్తాహీ వారాహి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు


వార్తాహీ వారాహి అవతారంలో అమ్మవారు

అల్లిపురం: బంగారుమెట్ట షిర్డీసాయి దర్బార్‌లో వెలసిన అనఘాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో వారాహి నవరాత్రుల సందర్భంగా సోమవారం అమ్మవారు వార్తాహీ వారాహి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారికి పొంగలి ప్రసాదం నివేదించి, యక్షిణి దీపంతో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధం కావాలి

జగదాంబ: కార్మిక, ఉద్యోగుల వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. సోమవారం ఆయన పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పడాల రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ బీజేపీ హయాంలో కార్మిక చట్టాలను కాలరాసే కుట్ర చేస్తున్నారన్నారు. నూతన పైప్‌లైను పేరిట దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలైన విశాఖ ఉక్కు, బీఎస్‌ఎన్‌ఎల్, అయిల్ పరిశ్రమ, బొగ్గు గనులు, విమానాశ్రయాలు, రైల్వే వంటి అన్ని ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరించేందుకు చూస్తున్నారన్నారు. ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు ఆదినారాయణ, జిల్లా నాయకులు బీసీహెచ్ మసేన్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించాలి

డాబాగార్డెన్స్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ చివరి పర్యటనకు గుర్తుగా బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన రాజీవ్‌గాంధీ స్మారక భవనాన్ని తిరిగి నిర్మించాలని, ఇటీవల జీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సీ హారియర్ ప్రదర్శన శాల ప్రాంగణానికి రాజీవ్‌గాంధీ స్మృతి భవనంగా నామకరణం చేసి ఆయన ఫొటో ఎగ్జిబిషన్ పెట్టాలని నగర కాంగ్రెస్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం మేయర్ హరి వెంకట కుమారికి నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవిందరాజు, లక్ష్మి, గుత్తుల శ్రీనివాస్, వేగి వెంకటేష్ పలువురు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు.

మొబైల్ మైకు.. సరికొత్త కిటుకు

అప్పుడెప్పుడో వ్యాపారులు ఏది విక్రయించాలన్నా అందరికీ పరిచయమున్న ఊరి చివర బజార్లలో తమ వస్తువులను రాశులుగా పోసి అమ్మకం చేసేవారు. పూర్వ కాలం నాటి సంతల ద్వారా వచ్చిన సాంప్రదాయం ఇది. తర్వాత మార్కెట్లు వచ్చాయి. వ్యాపారులంతా ఒకేచోట వస్తువులు విక్రయించేవారు. అదే విధంగా వీధులంట తిరుగుతూ కూడా చిరు వ్యాపారులు అమ్మకాలు సాగిస్తుండేవారు. తమ సరకుల గురించి వినియోగదారులకు తెలిసేలా అరుస్తూ వీధివీధి తిరిగేవారు. రోజులు మారాయి. సాంకేతికత అభివృద్ధి చెందింది. దాంతో చిరు వ్యాపారులు ఇప్పుడు శ్రమకోర్చి అరవకుండా మొబైల్ మైకులు ఉపయోగిస్తూ తమతమ వ్యాపారాలు చేసుకుంటున్నారు.

- అరవకుండానే సరకులు విక్రయిస్తున్న వ్యాపారులు
- కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతికత


ఆటోపై మైకు ఏర్పాటు చేసుకుని మామిడి పండ్లు విక్రయిస్తున్న వ్యాపారి


తోపుడుబండికి మైకు ఏర్పాటు చేసుకుని నిమ్మకాయలు విక్రయిస్తున్న చిరు వ్యాపారి


టౌన్ కొత్తరోడ్డు వద్ద మైకు ద్వారా స్టీల్ సామాన్లు విక్రయిస్తూ..

డాబాగార్డెన్స్: శాస్త్ర సాంకేతిక రంగం అభివృద్ధి చెందుతోందనడానికి నగరంలో విస్తరిస్తున్న మొబైల్ మైక్ వ్యాపారమే నిదర్శనం. ఒకప్పుడు కూరగాయలు కొనాలంటే కిలోమీటరు పైబడే వెళ్లాల్సి వచ్చేది. స్టీల్ సామాన్లు.. ఇంటి సామాన్లు కావాలంటే మార్కెట్‌కి పరిగెత్తాల్సి వచ్చేది. గ్యాస్ స్టవ్ రిపేరైందంటే మరమ్మతు దుకాణాలు వెతుక్కోవలసి వచ్చేది. అంతెందుకు మనిషి అనారోగ్యానికి గురయ్యాడంటే క్లినిక్‌లు.. ఆసుపత్రి బాట పట్టేవాడు. రోజులు మారాయి. పట్టణాలే కాదు.. పల్లెలు.. గ్రామాలు అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాయి. నేరుగా ఇంటి ముందరకే కూరగాయలు వచ్చేస్తున్నాయి. ఇంటి సామాగ్రి.. స్టీల్‌సామాన్లు.. వంట సామగ్రి ఇంట్లోకే వచ్చేస్తున్నాయి. గ్యాస్ స్టవ్ రిపేరైతే.. ఆ మెకానిక్ ఇంటికి వచ్చి రిపేర్ చేసేస్తున్నాడు. చివరకు షుగర్.. బీపీ వంటి టెస్ట్‌లు ఇంటి వద్దనే చేసేస్తున్నారు. ఇవన్నీ అందుబాటులోకి రావడంతో మండుటెండల్లో రోడ్లపై విక్రయించే కూరగయాలు.. అయ్యా గ్యాస్ స్టవ్ రిపేర్లు చేస్తామంటూ అరిచే రోజులకు స్వస్తి పలికారు. తమ వాహనాలకు ఓ మైక్ సెట్ చేసుకుని.. వారు విక్రయించే.. లేదా సేవలందించే సమాచారాన్ని రికార్డు చేసి.. దాని ద్వారా నడిరోడ్డుపైకి వస్తున్నారు. దీంతో అరిచే రోజులకు స్వస్తి పలుకుతున్నట్టు కనిపిస్తోంది. ఓ తోపుడు బండిపై కూరగాయలు విక్రయించే చిరువ్యాపారి తన బండికి మైక్ బిగుంచుకుని తను విక్రయించే కూరగాయల చిట్టాను రికార్డు చేసి నడిరోడ్లపై అరవకుండానే.. మైకు ద్వారా కూరగాయలు విక్రయిస్తున్నాడు. మామిడి పండ్లు విక్రయించే వారు.. 2 కేజీలు రూ.100.. 5 కేజీలు రూ.200 అంటూ తమ వాహనాలకు ఓ మైకును ఏర్పాటు చేసుకుని విక్రయిస్తున్నారు. స్టీల్‌సామాన్లు విక్రయించే వారు కూడా ఓ ఆటో నిండా అన్ని రకాల స్టీల్‌సామాన్లు వేసుకుని నగర వీధుల్లో మైకుల ద్వారా పిలుస్తూ వస్తువులు విక్రయిస్తున్నారు. భవిష్యత్ రోజుల్లో ప్రతీది మన ఇంటి వద్దకే.. మన ఇంటి ముందరే ఉంటాయనడానికి షుగర్.. బీపీ వంటి టెస్ట్‌లు కూడా వచ్చేసాయి. ద్విచక్ర వాహనంపై సోఫాలు రిపేర్ చేస్తాం.. గ్యాస్ స్టవ్‌లు రిపేర్ చేస్తామంటూ మైకుల ద్వారానే ప్రచారం గావిస్తూ సేవలందిస్తున్నారు.

పలువురికి ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థికసాయం


బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: సోమవారం నియోజకవర్గంలో పర్యటించిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ 34వ వార్డు కొబ్బరితోటకు చెందిన దేవులపల్లి పరదేశి (55) కుటుంబాన్ని పరామర్శించారు. పరదేశి వడదెబ్బ కారణంగా చనిపోయాడు. దీంతో ఎమ్మెల్యే వారింటికి వెళ్లి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సాయం కుటుంబానికి అందజేశారు. అదే ప్రాంతానికి చెందిన పైడిపల్లి శ్రీను బైపాస్ సర్జరీ చేసుకోవడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని తెలియజేయడంతో వారికి రూ.5,500 అందజేశారు. జెండా చెట్టు వీధికి చెందిన పెదగాడి సత్యనారాయణ గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్నారని, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా వైద్యం జరిగిందని తెలుసుకున్న ఆయన అతన్ని పరామర్శించి రూ. 5 వేలు ఆర్థిక సాయం చేశారు. అదే ప్రాంతానికి చెందిన బొడ్డు దుర్గారావు లారీ ప్రమాదంలో ఎడమ చేయి పూర్తిగా కోల్పోయిన సంగతి తెలుసుకుని అతన్ని పరామర్శించి రూ.2,500 ఆర్థిక సాయం చేశారు. తమ కష్టసుఖాలు తెలుసుకుని ఆర్థిక భరోసా కల్పించడం పట్ల బాధితులు ఎమ్మెల్యే వాసుపల్లికి కృతజ్ఞతలు తెలిపారు. వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, వాసుపల్లి నారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ వినతి

మహారాణిపేట : వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భారత విద్యార్థి సమాఖ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా కార్యదర్శి లాలం జగ్గు నాయుడు ఆధర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ప్రభుత్వం ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి స్పందనలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జి. పల్లవి, ఏయూ కార్యదర్శి పి. సూర్య, జిల్లా అధ్యక్షుడు ఎండీ శివ పాల్గొన్నారు

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు


డీఆర్ఎం కార్యాలయం రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మి, సిబ్బంది

అల్లిపురం: ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని టూటౌన్ ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మి తెలిపారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలుచోట్ల ఆమె తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ముఖ్యంగా పెండింగ్ చలానాలు ఆన్‌లైన్‌లో తనిఖీలు చేసి వాటిని అక్కడికక్కడే కట్టించారు. చలాన్లు పడకుండా చూసుకోవాలని, అన్ని రకాల రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. లేని ఎడల చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలని స్పష్టం చేశారు.

జ్ఞానానంద ఆశ్రమంపై జ్యుడీషియల్ విచారణ జరపాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకురాళ్లు

మహారాణిపేట : జ్ఞానానంద ఆశ్రమంపై వచ్చిన ఆరోపణలపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ మహిళా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధుల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలిపి, స్పందనలో వినతిపత్రం అందించారు. పేదలు, అనాథ పిల్లలను చేర్చుకుని పూర్ణానంద సరస్వతి ఆశ్రమం నిర్వహిస్తున్నారని పీవోడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి ఆరోపించారు. పిల్లలపై దాడులు చేస్తూ వెట్టిచాకిరీ చేయిస్తున్నాంటూ గతంలో కూడా అనేక ఫిర్యాదులు వచ్చాయన్నారు. 12 సంవత్సరాల బాలిక నిర్బంధం, లైంగిక దాడి, శారీరక హింస, వెట్టిచాకిరీపై ఇప్పుడు కూడా కేసు నమోదు చేశారని లక్ష్మి అన్నారు. పిల్లల జీవితాలతో ఆడుకుంటున్న జ్ఞానానంద ఆశ్రమ అరాచకాలపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని, మహిళా ఉద్యమకారులపై చేయి చేసుకున్న ఎస్ఐ దివ్యజ్యోతిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ, కార్యదర్శి వై. సత్యవతి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎంఏ బేగం, చైతన్య మహిళా సంఘం అధ్యక్షురాలు పీఎస్ పద్మావతి పాల్గొన్నారు.

సమస్య పరిష్కారం కోరుతూ ఉపాధ్యాయుల వినతి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న డీఎస్సీ 1998 ఉపాధ్యాయులు

మహారాణిపేట : డీఎస్సీ–1998 ద్వారా ఎంపికైన తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎంటీఎస్ ఉపాధ్యాయులు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర హామీ కారణంగా దయతో ఇచ్చిన ఆర్డరుతో తమను నియమించారని తెలిపారు. మొదట అందరినీ సుదూర ప్రాంతాల్లో నియమించగా ఏప్రిల్ 30 వరకూ పని చేశామని తెలిపారు. అయితే తామంతా 50 ఏళ్లు పైబడిన వారం కావడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లలేకపోతున్నట్లు రాష్ట్ర కమిషనర్‌కు తెలియజేశామన్నారు. దీనిపై కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చారని, కాని నేటి వరకు ఎలాంటి కౌన్సెలింగ్ జరగలేదన్నారు. స్థానిక మండలాల్లో గానీ, పక్క మండలాల్లో గానీ నివాసానికి సమీపంలో నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై వాహనాలు తొలగించిన ట్రాఫిక్ పోలీసులు


ఆక్రమణల సమయంలో రహదారి..


అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మి

సాక్షి ఎఫెక్ట్..

అల్లిపురం: 'రహదారుల ఆక్రమణ..ఆపై వాదన'అనే శీర్షికతో సోమవారం వెలువడిన వార్తా కథనానికి టూటౌన్ ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మి స్పందించారు. సాయంత్రం నేరెళ్లకోనేరు వీధి, హరిత లాడ్జి నుంచి గణపతి దేవాలయం వరకు రోడ్డు మొత్తం మెకానిక్, టింకరింగ్ పనులతో ఆక్రమించిన దుకాణాలను సిబ్బంది, క్రేన్ సహకారంతో తొలగించారు. దుకాణ యజమానులను ఒక దగ్గర చేర్చి అవగాహన కల్పించారు. ఇకపై రోడ్డు ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. ఎవరికీ ఇబ్బంది కలిగించకుండా పనులు చేసుకోవాలన్నారు.

ఆర్‌ఎంపీలకు ఉచిత వైద్య పరీక్షలు

మహారాణిపేట : ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్‌ఎంపీ గ్రామీణ వైద్యులకు ఎంవీపీకాలనీలోని మెడికవర్ హాస్పిటల్‌లో నేటి నుంచి నెల రోజుల పాటు ఉచితంగా పరీక్షలు చేయనున్నట్లు హాస్పిటల్‌కు చెందిన మహేష్, వైస్ ప్రెసిడెంట్ ఎన్. పద్మజ తెలిపారు. ఈ పరీక్షలు సమారు రూ. 5 వేలు ఖరీదు చేస్తాయని మెడికవర్ వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా మెడికవర్ యాజమాన్యానికి సంఘం గౌరవ అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి ధన్యవాదాలు తెలిపారు. సామాజిక సేవా కార్యకర్త కోన ప్రకాష్, విశాఖ జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, జిల్లా సలహాదారు బాలశంకరం పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న పీతల వాసు

డాబాగార్డెన్స్: జగనన్న సురక్షపై విశాఖ సౌత్ క్లస్టర్ 4 మండలాల కన్వీనర్ పీతల వాసు సోమవారం 30వ వార్డు పరిధి తాడివీధి, రెల్లివీధి, సాలిపేట సచివాలయాల్లో స్థానిక వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నంతో కలిసి వలంటీర్లు, గృహసారథులకు అవగాహన కల్పించారు. పథకాలు అమలవుతున్న తీరు.. జనాల్లోకి ఎలా తీసుకెళ్లాలి, ప్రజలతో ఎలా మాట్లాడాలి, వలంటీర్ విధి విధానాలు తదితర అంశాలపై వివరించారు. మరో 30 ఏళ్ల పాటు జగనన్న ముఖ్యమంత్రిగా ఉండాలని అభిలషించారు. అందుకు యావత్ రాష్ట్ర ప్రజలు కలిసి కట్టుగా ఉండి రాబోయే ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలిపించి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెంటపల్లి సత్యనారాయణ, వడ్డాది దిలీప్, వెంకట్, దేవరాజు, జ్యోతి, మణి, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నాలుగేళ్ల డిగ్రీతో ఎంతో ప్రయోజనం

డాబాగార్డెన్స్: విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులు, విదేశాల్లో ఉన్న అవకాశాల నేపథ్యంలో నాలుగేళ్ల పాటు చదువుకునే డిగ్రీకి ఎన్నో ప్రయోజనాలున్నాయని ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు తెలిపారు. నాలుగేళ్ల డిగ్రీ కోర్సులపై సోమవారం కళాశాల ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల డిగ్రీ కోర్సు సింగిల్ సబ్జెక్ట్ జాయిన్ అయిన విద్యార్థులున్నారని, వారందరికీ విదేశాల్లో ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు. డీన్ శంకరనారాయణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కృష్ణకుమారి, ఎగ్జామినేషన్ కన్వీనర్ సీహెచ్ మల్లిక, హిందీ ఫ్యాకల్టీ జేవీఎస్‌వీఎల్ శ్రీనివాసమూర్తితో పాటు కళాశాలలోని 17 విభాగాలకు చెందిన డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సులో మేయర్.. సైకిల్‌పై కమిషనర్


ప్రజా రవాణా వ్యవస్థ ద్వారా జీవీఎంసీకి చేరుకుంటున్న మేయర్


సైకిల్‌పై జీవీఎంసీకి చేరుకుంటున్న కమిషనర్

- కాలుష్య నియంత్రణలో అధికారుల చిత్తశుద్ధి
- ప్రజావాహనాల్లో ప్రయాణం

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణలో భాగంగా నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ప్రతి సోమవారం వాహనాలు వదిలి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగిస్తూ పలువురు ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా మేయర్ ఆరిలోవ క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి చేరుకున్నారు. కమిషనర్ బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వచ్చి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో వాయి, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ విశేష కృషి చేస్తుందని, మొక్కల సంరక్షణ, కార్యాలయంలోకి ఉద్యోగుల వాహనాలు అనుమతించకపోవడం వంటి చర్యలు తీసుకున్నామన్నారు.

బ్యాంక్ ఖాతాలు తెరిపించాలి

జగదాంబ: జగనన్న ఇళ్ల పథకం లబ్ధిదారులతో బ్యాంక్ అకౌంట్లు ఓపెన్ చేయించాలని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ కె.శివప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన జోనల్ కార్యాలయంలో మాట్లాడుతూ పేదల ఇళ్లకు గాను కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.30 వేలు కలిపి రూ. లక్షా ఎనభై వేలు ఇస్తారన్నారు. ఇందుకు ప్రతి ఒక్క లబ్ధిదారు కచ్చితంగా బ్యాంక్ అకౌంట్ ప్రారంభించాలని జెడ్సీ శివప్రసాద్ తెలిపారు.

స్పందనలో ఎమ్మెల్యే వినతి


జీవీఎంసీలో నిర్వహించిన జగనన్నకు చెబుదాంలో వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలో, జీవీఎంసీలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వినతిపత్రాలు అందజేశారు. 36వ వార్డు పరిధిలో సచివాలయ వలంటీర్లుగా 2022 నవంబర్ నుంచి పని చేస్తున్న నలుగురు వలంటీర్లకు జూన్‌లో ఐడీ క్రియేట్ అయినప్పటికీ నవంబర్ నుంచి జీతాలు రావల్సి ఉండగా జూన్ నెల జీతం మాత్రమే అందిందని, మిగిలిన 7 నెలల జీతం మంజూరయ్యేలా చూడాలని కోరారు. సచివాలయ వలంటీర్ల సేవలు గుర్తించి ప్రతి సంవత్సరం సేవా మిత్ర ప్రశంసా పత్రంతో పాటు రూ.10వేలు నగదుగా రావల్సినప్పటికీ వారికి ఇప్పటి వరకు మంజూరు కాలేదని, త్వరితగతిన మంజూరయ్యేలా చూడాలని ఆ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, వార్డు అధ్యక్షుడు రాజు ద్వారా వినతి పత్రం అందజేశారు.

సమస్యలు పరిష్కరించండి


జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ విల్లూరి

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో సమస్యల పరిష్కారం కోరుతూ కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మకు వినతిపత్రం అందజేశారు. సోమవారం జీవీఎంసీలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో విల్లూరి మాట్లాడుతూ ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ క్రికెట్ స్టేడియం చుట్టూ దుకాణ సముదాయం నిర్మించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అలాగే గాజులవీధిలో నూతన అంగన్‌వాడీ కేంద్రం నిర్మించాలని కోరారు. పూర్ణా మార్కెట్ జంక్షన్ నుంచి రామకృష్ణ జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపులా సీసీ రోడ్లు నిర్మించాలని.. అలాగే పలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోజు కూలీ మృతి


మృతుడు కాంతారావు

జగదాంబ: హార్బర్ పోలీసు స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉస్‌గ్రీన్ రీసోర్సు కంపెనీలో డైలీ లేబర్‌గా పని చేస్తున్న కాంతారావు (40) అనే వ్యక్తి మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అకస్మాత్తుగా నేలపై పడిపోయాడని తెలిపారు. స్పృహ కోల్పోయిన ఆ వ్యక్తిని సూపర్‌వైజర్ వెంటనే కంపెనీ వాహనంలో కేజీహెచ్‌కు తరలించగా ఆ వ్యక్తి మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారన్నారు. దీనిపై హార్బర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి 5.3 అడుగుల ఎత్తు, చామనఛాయతో, నీలం రంగు షర్టు, జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. సంబంధీకులు 9491006430 నంబర్లలో సంప్రదించాలని హార్బర్ పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారాలు ఇవ్వాలి

మహారాణిపేట : హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేస్తూ, విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారాలు తక్షణం ఇవ్వాలని కోరుతూ సోమవారం దళిత హక్కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి జరిగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు చింతాడ జోగారావు మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ పథకాన్ని కొనసాగించాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగం నేరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ

మహారాణిపేట : మాదక ద్రవ్యాల వినియోగం చట్టరీత్యా నేరమని, ఈ కేసులకు ఎలాంటి రాజీ లేదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి ఎం.వి.శేషమ్మ అన్నారు. సోమవారం ఆంధ్రా మెడికల్ కాలేజీ అనాటమీ విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం కేసుల విచారణ జరుగుతుందన్నారు. డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించడం కోసం తాము ప్రయత్నం చేస్తున్నామన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంటు డైరెక్టర్ జె.మాధవి మాట్లాడుతూ డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం అస్తవ్యస్తం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో అసిస్టెంట్ సూపరింటెండెంట్ మజ్జి వినీష, ఏఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మన్మథరావు, వైద్యులు రాధిక, రవీంద్రకిషోర్ తదితరులు పాల్గొన్నారు.